
తుని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఏర్పాట్లను కలెక్టర్ నివాస్‌కు వివరిస్తున్న ఈఆర్వో రామలక్ష్మి


తుని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఎన్నికల సామగ్రిని తనిఖీ చేస్తున్న పీఓలు, ఏపీఓలు.


ఎన్నికల సామగ్రి, ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న అధికారులు


ప్రత్తిపాడు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ప్రశాంతంగా ఎన్నికల సామగ్రి పంపిణీ
- నియోజకవర్గంలో 224 పోలింగ్ స్టేషన్లు
- ఓటుహక్కు వినియోగించుకోనున్న 2,24,538 మంది ఓటర్లు

తుని/తుని రూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. తుని నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటర్లు తమ ఓటుహక్కును ప్రశాంతంగా వినియోగించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ కేవీ రామలక్ష్మి తెలిపారు. తుని మండలం వి.కొత్తూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు ఈవీఎంలు, వీవీ ప్యాట్స్, ఎన్నికల సామగ్రిని అందజేశారు.

ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది

నియోజకవర్గంలో 223 పోలింగ్ స్టేషన్లకు పోలీసుల బందోబస్తు నడుమ ప్రత్యేక బస్సుల్లో సిబ్బంది బయలుదేరి వెళ్లారు. పీఎస్‌లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో 2,24,538 మంది ఓట్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,10,699 మంది, స్త్రీలు 1,13,814 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు. తుని మండలంలో 72 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 66,718 మంది, తొండంగి మండలంలో 72 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 75,194 మంది, కోటనందూరులో 41 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 39,656 మంది, తుని పట్టణంలో 39 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 42,970 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

19 రూట్లలో..

ఎన్నికల నిర్వహణకు తుని నియోజకవర్గాన్ని మూడు మండలాలు, 19 రూట్లుగా విభజించారు. ఒక్కొక్క రూట్‌కి ఒక బస్సును ఏర్పాటు చేశారు. ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న రూట్లలో అదనపు వాహనాలను సమకూర్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ సిబ్బందికి ఈవీఎంలు, వీవీ ప్యాట్స్, ఇతర ఎన్నికల సామగ్రిని అధికారులు అందజేశారు. మధ్యాహ్నం భోజనం అనంతరం మూడు గంటల నుంచి సిబ్బందితో ప్రత్యేక వాహనాలు ఆయా పోలింగ్ స్టేషన్లకు బయలుదేరాయి. ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి ఆరుగురు చొప్పున సిబ్బందిని నియమించారు. నియోజకవర్గానికి అదనంగా మరో 150 మంది సిబ్బందిని రిజర్వుడ్‌లో ఉంచారు.


జగ్గంపేట డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎన్నికల సిబ్బంది సందడి

పటిష్టమైన బందోబస్తు

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు స్టేట్ పోలీసులతో పాటు ఆర్మీ బలగాలను నియమించారు. తుని నియోజవర్గంలో 224 పోలింగ్ స్టేషన్లు ఉండగా అందులో 56 సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఇద్దరు డీఎస్పీల ఆధ్వర్యంలో ఆరుగురు సీఐలు, ఆరుగురు ఎస్సైలతో పాటు 150 మంది పోలీసులను నియమించారు. మరో 150 మంది కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు రూరల్ సీఐ మూర్తి తెలిపారు.

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,17,267 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,07,189, స్త్రీలు 1,10,057 ఇతరులు 21 మంది ఉన్నారు. కాగా వీరంతా ఈసారి ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వీరి కోసం 227 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఏలేశ్వరం మండలంలో 63, ప్రత్తిపాడు మండలంలో 67, శంఖవరం మండలంలో 49, రౌతులపూడి మండలంలో 48 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు వరకూ పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్‌స్టేషన్ల సమీపంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోటీలో 15 మంది అభ్యర్థులు

ప్రత్తిపాడు అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి పోటీలో 15 మంది అభ్యర్థులు ఉన్నారు.వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా వరుపుల సుబ్బారావు, టీడీపీ అభ్యర్థిగా వరుపుల సత్యప్రభ, కాంగ్రెస్ పార్టీ నుంచి నీరుకొండ సత్యనారాయణ, జైభీమ్‌రామ్ భారత్ పార్టీ అభ్యర్థిగా దాడిశెట్టి వీరబాబు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ అభ్యర్థిగా ఏగుపాటి అర్జునరావుతో పాటు పలువురు పోటీలో ఉన్నారు.

ఏర్పాట్లు పూర్తి

పోలింగ్ నిమిత్తం అధికారులు ఆయా కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అసాంఘిక కార్యకలపాలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల నుంచి 100 మీటర్ల దూరం వరకూ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

అన్నవరంలో ఏర్పాట్లు పూర్తి

అన్నవరం: శంఖవరం మండలంలో మేజర్ పంచాయతీ అన్నవరంలో సోమవారం జరిగే పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామంలో మొత్తం 10,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 5,258, పురుషులు 5,106, ఇతరులు ఒకరు ఉన్నారు. గ్రామంలో 11 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో తొమ్మిది మంది చొప్పున మొత్తం 11 పోలింగ్ స్టేషన్లలో 99 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని ఎన్నికల అధికారులు తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.


ప్రత్తిపాడు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ స్టేషన్ల వారీగా పోలింగ్ సిబ్బంది

నేడే పోలింగ్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు అసెంబ్లీ, కాకినాడ లోక్‌సభ స్థానాలకు సోమవారం ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్తిపాడు మినర్వా విద్యా సంస్థల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం సిబ్బంది తరలివెళ్లారు. ప్రత్తిపాడు సెగ్మెంట్ నుంచి ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు (వైఎస్సార్ సీపీ)తో పాటు 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కాగా ఆదివారం స్థానిక డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల అధికారులు సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఓటర్ల కోసం అధికారులు 227 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు 227 మంది పీఓలు, 227 మంది ఏపీఓలు, సుమారు 900 మంది ఓపీఓలను నియమించారు. వీరంతా పోలింగ్ సామగ్రిని తీసుకుని, వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను తరలివెళ్లారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ ప్రత్తిపాడు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

జగ్గంపేట: నియోజకవర్గంలో సోమవారం జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. వాతావరణ పరిస్థితులు మారినా ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఆదివారం ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు, వీవీ ప్యాట్స్, ఇతర పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు.

248 పోలింగ్ కేంద్రాలు

జగ్గంపేట నియోజకవర్గంలోని 248 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 2,29,563 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోన్నారు. దీని కోసం 1498 మంది ఎన్నికల సిబ్బందిని నియిమించినట్టు ఈఆర్వో శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గాన్ని 48 రూట్లు 24 సెక్టార్లుగా విభజించారు. నియోజకవర్గంలో 40 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పోలింగ్ నిర్వహించనున్నట్టు చెప్పారు. పోలింగ్ స్టేషన్ల వద్ద సిబ్బందికి ఇబ్బంది లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించామని శ్రీనివాసరావు వివరించారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను కాకినాడలోని జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలిస్తామని తెలిపారు. కాగా ఆదివారం సాయంత్రం ఎన్నికల అధికారులు, సిబ్బంది ప్రత్యేక బస్సులు, వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ప్రతిపౌరుడు తమఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఈఆర్వో సూచించారు.


జగ్గంపేటలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలివెళుతున్న సిబ్బంది

పోలింగ్ సజావుగా సాగేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ నివాస్

జగ్గంపేట: జిల్లాలో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకున్నామని, పోలింగ్ సిబ్బంది ధైర్యంగా తమ విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ సూచించారు. జగ్గంపేటలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాక్ పోలింగ్ పూర్తయిన వెంటనే మొదటి ఓటు వేసే ముందు ఈవీఎంల్లో జీరో ఉండేగా చూసుకోవాలన్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. పోలింగ్ పూర్తయ్యాక క్లోజింగ్ బటన్ తప్పనిసరిగా నొక్కాలని సూచించారు. పోలింగ్ సమయంలో సిబ్బంది ప్రధానమైన పది అంశాలతో కూడిన స్టిక్కర్‌ను టేబుల్ వద్ద అతికించుకుని, దానిలోని అంశాలను సరిచూసుకోవాలన్నారు. ఏదైనా సాంకేతిక సమస్య వస్తే ఆందోళనకు గురికావద్దని, తక్షణమే ఆర్‌ఓలకు సమాచారం అందిస్తే సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. ఈవీఎంలు పనిచేయకపోతే వాటిస్థానంలో వేరే వాటిని ఏర్పాటు చేయడానికి అదనపు ఈవీఎంలు సిద్ధం చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో పోలింగ్ బూత్‌లు వద్ద శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే గందరగోళానికి గురికావద్దని, పోలీసు యంత్రాంగం వచ్చి సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు. ఎన్నికల సిబ్బందికి జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యాక ఎన్నికల సిబ్బంది స్వగ్రామాలకు చేరడానికి రవాణా సౌకర్యం కల్పించామన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 1640 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలో 331 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి అక్కడ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


జగ్గంపేటలో ఈవీఎంలను పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ఆదివారం జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు సత్యదేవుని గర్భాలయంలో ఆదిశంకరాచార్య విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకారంలో ఆదిశంకరాచార్య చిత్రపటం, విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పండితులు మాట్లాడుతూ హిందువులు ఎన్నో మతాలు, వర్గాలుగా చీలిపోయి ఘర్షణ పడుతున్న సమయంలో అన్ని మతాలు ఒక్కటే అని చాటిచెప్పిన జగద్గురు ఆదిశంకరాచార్య సాక్షాత్తు శంకరులే అన్నారు. దేశంలో నలుదిక్కులా నాలుగు పీఠాలు స్థాపించి హిందూధర్మ పరిరక్షణకు పాటుపడిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, ముష్టి పురుషోత్తం, ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆదిశంకరాచార్య విగ్రహం, చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న పండితులు


ఓటర్ల చేతిలో అభ్యర్థుల భవితవ్యం

- నేడే సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- రాజకీయ పార్టీల్లో టెన్షన్ టెన్షన్

తుని: ఎన్నికల ఘట్టం చివరి అంకానికి చేరింది. ఓటరు దేవుడి చేతుల్లో అభ్యర్థుల భవితవ్యం ఉంది. ఓటర్లు ఎవరిని అనుగ్రహిస్తారో అని అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. ప్రధాన రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్ల నియామకంలో బిజీగా ఉన్నాయి. ఇక అధికార యంత్రాంగం పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. తుని నియోజకవర్గంలో 224 బూత్‌లు ఉన్నాయి. ఈవీఎంలు, పోలింగ్ అధికారులు, సిబ్బందిని ఆయా మండలాలోని పోలింగ్ స్టేషన్లకు తరలించారు. ఓటర్లు సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని ఈఆర్వో రామలక్ష్మి తెలిపారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి రాజకీయ పార్టీల నాయకులు అందివచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లు పట్టణాల నుంచి సొంతూళ్లకు చేరుకున్నారు. ఈసారి గత ఎన్నికల కంటే భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ప్రజలకు మేలు చేసే పార్టీకే మద్దతు ఇవ్వాలని ఓటర్లు నిర్ణయించుకున్నారు. రాగా ఎన్నికల్లో ప్రతిఒక్కరూ రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోవాలని రాజకీయ నాయకులు, అధికారులు కోరుతున్నారు.

అందరి చూపు తొండంగి వైపు

నియోజకవర్గంలో ఎక్కువ మంది ఓటర్లు ఉన్న తొండంగి మండలం వైపు అందరూ చూస్తున్నారు. అభ్యర్థుల గెలుపు, ఓటమిలో కీలక పాత్ర పోషిస్తారు ఈ మండల ఓటర్లు. నియోజకవర్గంలో 2,16,973 మంది ఓటర్లు ఉంటే తొండంగి మండలంలో 70 వేల మంది ఉన్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లోనూ ఇక్కడి ఓటర్లు కీలక పాత్ర పోషించారు. 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థికి మద్దతు ఇచ్చారు. ఈ సారి ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇస్తారో వేచి చూడాల్సి ఉంది.



సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

నియోజకవర్గంలోని అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై ఎన్నికల అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. తొండంగి మండలం తీర ప్రాంతంలోని అద్దరిపేట నుంచి చోడిపల్లిపేట వరకూ మత్స్యకారులు, యాదవ సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఇందులో పలు చోట్ల పోలింగ్ సమయంలో ఘర్షణలు జరిగే అవకాశం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్ జరిగే దృశ్యాలను వెబ్ కాస్టింగ్ చేసే ఏర్పాట్లు చేశారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. కేంద్ర రక్షణ బలగాలను ఏర్పాటు చేశారు. కోటనందూరు, తుని మండలాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నా ఘర్షణలు చోటు చేసుకునే అవకాశం తక్కువ. ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

కొత్త ఓటర్లు కీలకం

నియోజకవర్గం పరిధిలో కొత్త ఓటర్లు 5 వేల పైన ఉన్నారు. వీరు తొలిఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎక్కువ శాతం విద్యావంతులు ఉన్నారు. యువతకు ఉపాధి భద్రత కల్పించే నాయకుడికే ఓటు వేస్తామని చెబుతున్నారు. అభ్యర్థుల గెలుపు ఓటముల్లో వీరు కీలకం కానున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలు పాటించాలని పోలీసులు కోరుతున్నారు. పోలింగ్ కేంద్రలో ఉండే పార్టీల ఏజెంట్లకు ఒక్కసారి మాత్రమే రిలీవర్ సదుపాయం కల్పించామని అధికారులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ ఖాయం

జగ్గంపేట: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేశారు. జగ్గంపేటలో ఆదివారం గ్రామ ఉపసర్పంచి బండారు రాజా ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సమావేశం అయ్యారు. సోమవారం పోలింగ్ సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించారు. ఓటర్లు వైఎస్సార్ సీపీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో జగ్గంపేట ఎంతో కీలమని, ఇక్కడే అత్యధిక ఓటర్లు ఉన్నారని తెలిపారు. జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించుకోవడానికి సోమవారం మరింత కష్టపడాలని బండారు రాజా సూచించారు. కార్యక్రమంలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జగ్గంపేటలో సమావేశమైన పార్టీ శ్రేణులు

అకాల వర్షంతో అవస్థలు


ప్రత్తిపాడు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అకాల వర్షానికి నేలకూలిన టెంట్


రాచపల్లి అడ్డురోడ్డు వద్ద కురుస్తున్న వర్షం

ప్రత్తిపాడు: అకాల వర్షంతో పోలింగ్ సిబ్బంది అవస్థలు పడ్డారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది తీసుకున్న చర్యలతో వర్షం నుంచి ఎన్నికల సిబ్బందికి కొంతమేర ఇబ్బందులు తప్పాయి. ప్రత్తిపాడు మినర్వా విద్యా సంస్థల ప్రాంగణంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు త్వరితగతిన పోలింగ్ సామగ్రిని పోలింగ్ అధికారులకు అప్పగించారు. ఆదివారం సాయంత్రం సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లే సమయంలో అకస్మాత్తుగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బస్సుల్లో సామగ్రిని తరలిస్తుండగా వర్షం కురవడంతో పోలింగ్ సిబ్బంది తమ సామగ్రితో తిరిగి మినర్వా ప్రాంగణంలోకి పరుగులు తీశారు. గాలులకు మినర్వా ప్రాంగణం బయట, లోపల వేసిన టెంట్‌లు నేలకూలాయి. ఆ సమయానికి టెంట్‌లలో సిబ్బంది లేకపోవడంతో ఎటువంటి నష్టం జరగలేదు. ఓటింగ్ యంత్రాలు, సిబ్బంది వర్షంలో తడిసిపోకుండా ఎన్నికల అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. వర్షం తగ్గిన వెంటనే సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.

ప్రత్తిపాడు రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత, ఉక్కబోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఓ మోస్తరు వర్షం కురిసింది. అప్పటి వరకు ఎండ తీవ్రతకు అల్లాడిపోయిన జనం వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది.

వైభవంగా డెక్కలపోలమ్మ జాతర

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు గ్రామ దేవత డెక్కలపోలమ్మ అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు రమేష్ ఆధ్వర్యంలో పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

మండలంలో 15 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు


కృష్ణునిపాలెంలో పోలింగ్ బూత్ వద్ద టెంట్ వేసి క్యూ ఏర్పాటు చేసిన దృశ్యం

గోకవరం: మండలవ్యాప్తంగా సోమవారం జరిగే ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 64 పోలింగ్ బూత్‌లు ఉండగా వీటిలో 15 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను అధికారులు గుర్తించారు. కృష్ణునిపాలెంలో ఐదు, మల్లవరంలో ఆరు, తిరుమలాయపాలెంలో నాలుగు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఒక్కో పోలింగ్ బూత్ వద్ద ఓటర్లకు ఇబ్బందులు లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని టెంట్లు వేశారు. అలాగే 32 బూత్‌ల వద్ద వీల్‌చైర్ సౌకర్యం కల్పించారు. ఒక్కో బూత్ వద్ద ఆరుగురు సిబ్బంది విధులు నిర్వహించనుండగా వారి కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆయా బూత్‌ల వద్దకు సిబ్బంది పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. ఆయా బూత్‌ల వద్ద పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం


చోడిపల్లిపేటలో శ్రీనుకు ఆర్థిక సహాయం అందిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ చోడిపల్లిపేట గ్రామానికి చెందిన కిడ్నీ బాధితుడు వెలుగు శ్రీనుకు స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీను రెండు కిడ్నీలు చెడిపోవడంతో కొద్ది రోజులుగా ఇంటికే పరిమితమయ్యాడు. భార్య, నలుగురు పిల్లలతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నేమాల శ్రీనివాసరావు, ఇతర సభ్యులు కలిసి ఆదివారం రూ.10 వేలు బాధితుడు శ్రీనుకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వెంకట్, శ్రీను, గోవిందు, వీరబాబు, శ్రీనుబాబు, నాగబాబు, డాన్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

తునికి చేరిన శివకరణ్‌సింగ్ పాదయాత్ర


తునిలో శివకరణ్‌సింగ్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

తుని: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పాదరక్షలు లేకుండా ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివకరణ్‌సింగ్ చేస్తున్న పాదయాత్ర ఆదివారం తునికి చేరింది. శివకరణ్‌సింగ్ పాదయాత్రకు ఆదివారం స్థానిక ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివకరణ్ సింగ్ మాట్లాడుతూ సనాతన సంస్కృతి అభివృద్ధే ధ్యేయంగా 2022 మార్చి 25న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం పతేపూర్ జిల్లా ఖరౌలీ గ్రామం నుంచి ప్రాదయాత్ర ప్రారంభించానన్నారు. ఇప్పటివరకూ 13 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశానని, ఈ యాత్ర కన్యాకుమారి వరకూ కొనసాగుతుందని చెప్పారు. గో సంపద సంరక్షణ, మత్తు పదార్థాలకు యువతను దూరంగా ఉంచి దేశభక్తిని పెంపొందించడం, అమరవీరులకు నివాళిగా మొక్కలు పెంచడం, భారతీయులంతా సుఖ సంతోషాలతో అభివృద్ధి పథంలో నడవాలన్నదే తన జీవిత ఆశయమని తెలిపారు. కార్యక్రమంలో కందుల వినోద్, కుందెం సత్యనారాయణ, చదరం నరిసింగరావు, ములగాల ఉదయ్‌కుమార్, పర్వత బాబూరావు, రాపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



రౌతులపూడిలో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

రౌతులపూడి: మండలంలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల ఎంఈవో కో ఆర్డినేటర్ ప్రేమ సాగర్ తెలిపారు. మండల వ్యాప్తంగా 48 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 43,326 మంది ఓటర్లు ఉండగా వీరిలో 21,497 మంది పురుషులు, 21,826 మంది స్త్రీలు, మరో ముగ్గురు ఇతరులు ఉన్నారని తెలిపారు. వీరంతా తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్నిరకాల వసతులు కల్పించినట్టు తెలిపారు.